క్లుప్తంగా

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు


జలదంకిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జలదంకి: మండలంలోని చామదల, జలదంకి, జమ్మలపాళెం గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు వృద్ధి చెందాలని వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

అచ్చమాంబ పేరంటాళ్లకు విశేష పూజలు


అచ్చమాంబ పేరంటాలు దేవాలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పొంగూరుమాలిచేలో కొలువై ఉన్న అచ్చమాంబ పేరంటాళ్లకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విశేష పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. దేవాలయం వద్దకు వచ్చిన భక్తులకు దేవాలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. విశేష పూజలు, అర్చనల అనంతరం ఆలయ పూజారి పాశర్ల పూడి వెంకటేశ్వర్లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

పోలేరమ్మకు ఎమ్మెల్యే సతీమణి ప్రత్యేక పూజలు


పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి రామిరెడ్డి ఆదిలక్ష్మి

బిట్రగుంట: బోగోలులో కొలువైన పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి నిర్వహిస్తున్న వార్షిక ఉత్సవాలు, సామూహిక కుంకుమ పూజల్లో భాగంగా రామిరెడ్డి ఆదిలక్ష్మి స్థానికులతో కలిసి అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే సతీమణి వెంట ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, మాజీ ఎంపీపీ పత్రి సులోచనమ్మ, వార్డు సభ్యురాలు ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, తూపిరి పెంచలయ్య, తుమ్మల రమణయ్య, పత్రి అంకులయ్య, పాశం రవీంద్రబాబు, మేకల శ్రీనివాసులు, గందూరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

ఉదయగిరి: మండలంలోని తిరుమాలపురానికి చెందిన మద్దిశెట్టి వినయ్ ఉన్నత విద్యాభ్యాసానికి మన ఫౌండేషన్ స్థాపకులు మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం రూ.5 వేలు నగదు అందజేశారు. భవిష్యత్తులో విద్యార్థి చదువుకు మరింత సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రంతుజా, బీ శ్రీనివాసులు ఉన్నారు.

నాణ్యత డొల్ల.. మన్నికెలా?

వరికుంటపాడు–తూర్పుబోయమడుగుల–కొత్తపల్లి తారు రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత కొరవడింది. కాంట్రాక్టర్లు కక్కుర్తి.. అధికారులు పర్యవేక్షణ లోపం వెరసి రోడ్డు నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నాణ్యతకు పెద్ద పీట వేయాలి అని హెచ్చరిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్సేంటేజీలకు ఆశ పడి కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్డు ఒక వైపు పనులు జరుగుతుంటేనే మరో వైపు నాణ్యత డొల్ల తనం బయట పడుతోంది.

- తూర్పుబోయమగుల–కొత్తపల్లి రోడ్డు నాసిరకంగా పనులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రోడ్డు నాణ్యతపై స్థానికుల ఆందోళన


పిల్లాపేరుపై నాసిరకంగా జరుగుతున్న కల్వర్టు పనులు

ఉదయగిరి: వరికుంటపాడు నుంచి తూర్పు బోయమడుగుల వరకు రెండేళ్ల కితం ప్రభుత్వం పీఎంజీవై (ప్రధానమంత్రి రోజ్‌గారి యోజన) ద్వారా తారురోడ్డు నిర్మాణం కోసం రూ.8.23 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో 12.295 కి.మీ దూరం తారురోడ్డు వేయాలి. వరికుంటపాడు, తూర్పుబోయమడుగుల, కొత్తపల్లి గ్రామాల్లో సిమెంట్ రోడ్డుతో పాటు తూర్పుబోయమడుగుల వద్ద పిల్లాపేరుపై కల్వర్టు చప్టా నిర్మాణం చేయాలి. 2021లో ఈ రోడ్డు పనులను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఏడాదిలో పూర్తి చేయాల్సిన పనులు ఇప్పుడికి కూడా పూర్తి కాలేదు.

నాణ్యతకు నీళ్లు

తూర్పుబోయమడుగుల వద్ద పిల్లాపేరుపై జరుగుతున్న కల్వర్టు వంతెన పనుల్లో నాణ్యత కనిపించడం లేదు. పునాది స్థాయిలోనే సీసీ పనులు నాసిరకంగా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కల్వర్టు పనుల్లో పెన్నా ఇసుక వాడాల్సిన ఉన్న అక్కడే లభించే నాణ్యత లేని ఇసుక వాడారు. సిమెంట్, కంకర, ఇసుక మిక్సింగ్‌లో కూడా నిబంధనలు పాటించలేదు. పనులు జరిగే సమయంలో సంబంధిత అధికారులు మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. వరికుంటపాడు వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో కూడా నాణ్యత కనిపించడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

తారురోడ్డు పనుల్లో కూడా అంతే

వరికుంటపాడు నుంచి బోయమడుగుల వరకు కొత్తగా వేసిన తారు రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు కనిపించడం లేదు. పలు చోట్ల మార్జిన్లకు నాణ్యత లేని మట్టి ఉపయోగించారు. తారు మిక్సింగ్ కూడా తగిన పాళ్లలో లేదు. కంకర నాసిరకంగా వాడారు. పనులు జరిగేటప్పుడు సంబంధిత అధికారులు కనిపించడం లేదు.


వరికుంటపాడు వద్ద నాసిరకంగా సీసీ రోడ్డు పనులు

నాణ్యతతో పనులు చేయిస్తున్నాం

రోడ్డు పనులు నాణ్యతతోనే జరిగేలా చూస్తున్నాం. పెన్నా ఇసుక వాడుతున్నాం. పనులు జరిగేటప్పుడు తగిన సిబ్బంది లేకపోవడంతో కొంత పర్యవేక్షణ లోపం ఉంది. పనులు సక్రమంగా చేయకపోతే కంట్రాక్టరు బాధ్యత వహిస్తారు.

– ప్రసాద్, ఏఈ, పంచాయతీరాజ్ స్పెషల్ వర్క్స్

సొంత బిడ్డలా సేవలు అందించాడు



కరోనా సమయంలో తెల్లవారు జామునే వెంకయ్యకు పింఛన్ అందిస్తున్న రాజేష్ (ఫైల్)

జలదంకి: కరోనా సమయంలో జలదంకి మండలం కమ్మవారిపాళెంకు చెందిన వలంటీర్ వింజం రాజేష్‌ను స్థానికులు తమ సొంత బిడ్డలా అభిమానిస్తున్నారు. స్థానికులకు ఏ కష్టం వచ్చినా వలంటీర్ ఆదుకుంటున్నాడు. తనకు కేటాయించిన 50 ఇళ్లలో ఏ అవసరాలు ఉన్న వారిలో ఒకడిలా సాయ పడుతున్నాడు. ఒకటో తేదీ రాగానే వేకువజామునే ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నాడు. గతంలో కరోనా మహమ్మారి సమయంలో వారికి అండగా నిలిచాడు. కరోనా సోకిన వారిని క్వారంటైన్‌కు పంపి పలువురిని కాపాడడంలో తన వంతు సాయం అందించాడు. అందరూ భయపడినా అతను మాత్రం ధైర్యంగా ముందుకు వచ్చి సేవలు అందించాడు.

నా సొంత బిడ్డల కంటే ఎక్కువ

నా బిడ్డల కంటే వలంటీర్ రాజేష్ అంటే నాకు ఎక్కువ. ఎందుకంటే మా ఇంట్లో ప్రభుత్వ పరంగా అన్ని పథకాలను ఠంచనుగా ఇంటికే అందిస్తున్నాడు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేకువ జామునే ఇంటి తలుపు తట్టి లేపి పింఛన్ అందిస్తున్నాడు. కరోనా సమయంలో సైతం ఎప్పటికప్పుడు మా ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందించేవాడు.



– తమ్మినేని వెంకయ్య, కమ్మవారిపాళెం

ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం


కలిగిరి: తెల్లపాడులో మాట్లాడుతున్న మేకపాటి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలను అభివృద్ధికి చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. మండలంలోని తెల్లపాడులో శ్రీకోదండరామస్వామి ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్త మారేళ్ల వెంకటశేషారెడ్డి నియామకం వివాదంపై ఆదివారం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీకోదండరామ స్వామికి, శ్రీభద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వ్యవస్థాపక ధర్మకర్త వెంకటశేషారెడ్డి, దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన జూపల్లి వెంకటేశ్వరరావు, ఉభయకర్తలు, గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారు చూపిన ఆధారాలను పరిశీలించారు. ఆలయాన్ని గ్రామస్తులందరూ కలిసి నిర్మించుకున్నారని శేషారెడ్డిని ధర్మకర్తగా అంగీకరిస్తాం, కాని వ్యవస్థాపక ధర్మకర్తగా అంగీకరించబోమని ఉభయకర్తలు, పలువురు గ్రామస్తులు తెలిపారు. చివరకు వ్యవస్థాపక ధర్మకర్తగా చెప్పుకునే శేషారెడ్డి సైతం ఆలయం గ్రామస్తులందరిదని స్పష్టం చేశారు. అనంతరం సమన్వయకర్త మేకపాటి మాట్లాడుతూ ఆలయం గ్రామస్తులందరిది కాబట్టి.. అందరి ఆమోదయోగ్యంగా, వివాదాలకు తావులేకుండా లిఖిత పూర్వకంగా రికార్డులు నమోదు చేయిస్తామన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో వివాదాలతో ఉత్సవాలు నిలిచిపోవడం బాధాకరమన్నారు. త్వరలోనే అందరం కలిసి వైభవంగా ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. ఆలయం వివాదం పరిష్కారానికి చొరవ చూపిన సమన్వయకర్త మేకపాటికి ఉభయకర్తలు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరం సచివాలయం పరిధిలో సోమ, మంగళవారాల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీఓ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తిమ్మానాయుడుపల్లిలో, మంగళవారం చౌటభీమవరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వివరించారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

డీఆర్ ఒక గొప్ప దార్శనికుడు


వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న కమిషనర్ కిరణ్

కావలి: డీఆర్ గొప్ప దార్శనికుడని, ఆయన ఎంతో ముందు చూపుతో కళాశాలలు స్థాపించారని మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ అన్నారు. డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో 60 మంది నిరుపేద వృద్ధులకు ఆదివారం బియ్యం, నిత్యావసర సరుకులను కమిషనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పేదలు, బలహీన వర్గాలు ఇక్కడ చదువుకుని దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నారని, డీఆర్ పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యధరకుమార్‌రెడ్డిలకు అభినందనలు తెలిపారు. చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ జవహర్ భారతి పూర్వ విద్యార్థి అయినందుకు చాలా గర్వంగా ఉందని, నా వంతుగా వృద్ధులకు తమ హాస్పిటల్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తానన్నారు. విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల ఆదిలక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీ ష్‌సింగ్, అమరావతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల వాహన ట్యాక్స్‌లు తగ్గించండి

ఆత్మకూరు: ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను పాఠశాలకు, ఇళ్లకు తీసుకెళ్లే వాహనాల ట్యాక్స్‌లను ఇటీవల ప్రభుత్వం పెంచిందని పాఠశాలల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ట్యాక్స్ తగ్గించాలని ప్రైవేట్ పాఠశాలల యూనియన్ అపస్మా నాయకులు కోరారు. ఆత్మకూరులోని మేధా పాఠశాలలో ఆదివారం అపస్మా కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. గతేడాది వరకు 51 సీట్లు ఉన్న పాఠశాల బస్ ట్యాక్స్ రూ.5,690 ఉండగా, ప్రస్తుతం రూ.23,160 పెంచిందని తగ్గించాలని కోరారు. అపస్మా కార్యవర్గ సభ్యులు జి ప్రభాకర్, సీహెచ్‌వీ రమణారెడ్డి, ఎస్ రామ్మోహన్‌రెడ్డి, టీసీ సుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, సురేష్‌బాబు, మల్లికార్జున, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సహాయం చేయాలన్నదే లక్ష్యం

- ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ గోసల రాఘవరెడ్డి


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌ఆర్‌ఐ గోసల రాఘవరెడ్డి

అనుమసముద్రంపేట: పేదవాళ్లను ఏదోక రూపంలో ఆదుకోవాలన్నదే తన లక్ష్యమని కొండమీద కొండూరుకు చెందిన, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ గోసల రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అనుమసముద్రం సచివాలయంలో శంకరనేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొండమీద కొండూరు స్వగ్రామమని, డబ్బు లేక, వైద్యశాలకు వెళ్లలేక ఎంతో మంది అభాగ్యులు కంటి శుక్లాలను పోగొట్టుకుంటున్నారన్నారు. అలాంటి వారి కోసం ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 8 రోజుల పాటు జరిగే ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి కంటి శుక్లాలను తొలగించే ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు దాదాపు 500 మంది ప్రజలు ఈ వైద్యశిబిరానికి హాజరయ్యారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు మధ్యాహ్నం భోజన వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, సర్పంచ్ కుదారి హాజరత్తమ్మ, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ షౌకాత్ ఆలీ, మండల కో ఆప్షన్ సభ్యుడు సంధాని, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రియాజ్ అహ్మద్, గోసల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా గంగమ్మ తల్లి


శాకంబరిదేవి అలంకారంలో గంగమ్మ తల్లి

సంగం: సంగంలోని త్రివేణి సంగమం ఒడ్డున కొలువైన పాలేటి గంగమ్మతల్లి ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గంగమ్మతల్లిని ఆదివారం సకలద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకంబరి అలంకారంలో ఉన్న గంగమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సంగం చెక్‌పోస్టు సెంటర్‌లోని మాతా పరమేశ్వరిదేవి ఆలయంలో సైతం భక్తులు ఆదివారం సాయంత్రం పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

పవన్‌కళ్యాణ్ నిరాధార ఆరోపణలు మానుకోవాలి


కొప్పోలు వెంకటేశ్వర్లు

ఆత్మకూరురూరల్: ప్రజలకు అంకిత భావంతో సేవలు అందిస్తున్న వలంటీరు వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీవింగ్ అధ్యక్షుడు కొప్పోలు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మర్రిపాడులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఉమెన్ ట్రాకింగ్ చేస్తున్నారని, డేటా చోరీకి పాల్పడుతున్నారని దారుణమైన విమర్శలు చేయడం తగదన్నారు. తన రాజకీయ యజమాని చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదవడం పవన్‌కళ్యాణ్ మానుకుని, వాస్తవాలను పరిశీలించి మాట్లాడాలన్నారు. ఆధారాలు ఉంటే బయట పెట్టాలిగానీ, ముఖ్యమంత్రికి ఆపాదిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించబోమన్నారు. ప్రజల నుంచి ఎలాంటి మద్దతు రాకపోవడంతో గందరగోళ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేయాలనుకోవడం సరికాదని పవన్‌కళ్యాణ్‌కు ఆయన హితవు పలికారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు


విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆత్మకూరుకు చెందిన తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. పట్టణంలోని జేఆర్‌పేట వినాయక స్వామి మందిరంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలికల విభాగంలో 586 మార్కులు సాధించిన ఎం స్నేహలతకు, బాలుర విభాగంలో 580 మార్కులు సాధించిన ఎ.కార్తికేయరెడ్డికి చెరో రూ.20 వేలు నగదు బహుమతిని అందజేశారు. 574 మార్కులతో ద్వితీయ స్థానం పొందిన డి రేణుకాచౌదరి, 571 మార్కులు సాధించిన కె వివేకానందరెడ్డికి రూ.15 వేల చొప్పున, 566 మార్కులతో తృతీయ స్థానం సాధించిన ఎ రేణుక, 557 మార్కులు సాధించిన పి హమీద్‌కు చెరో రూ.10 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దాత సోమవరపు యానాదిరెడ్డి సహకారంతో విద్యార్థులను ప్రోత్సహించేలా నిర్వహించడం పలువురికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివ ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వరరెడ్డి, సమితి గౌరవాధ్యక్షుడు గోవిందరెడ్డి, సోమవరపు సుబ్బరాయుడు, ఎ వెంకటరెడ్డి, కె రవీంద్ర, ఎస్‌వీ చలమయ్య, వెలిశెట్టి నారాయణ, ఎస్‌వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నాయకుల విచారణ


కార్మికులతో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో రెండు రోజులుగా తలెత్తిన పరిణామాలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆదివారం డిపోను సందర్శించి విచారణ చేపట్టారు. జిల్లా కమిటీ సభ్యులు మురళీమోహన్ రెడ్డి, కార్యదర్శి జానా వెంకటేశ్వర్లు, నెల్లూరు–1 డిపో కార్యదర్శి చెంచయ్య డిపోలోని కార్మికులతో మాట్లాడి సమస్యలకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు గ్యారేజీ కార్మికులు వారితో మాట్లాడుతూ గ్యారేజీలో జరుగుతున్న అనేక సమస్యలకు ఏఎంఎఫ్ వర్మ, సూపర్‌వైజర్ శ్రీనివాసులు ప్రధాన కారణమని తమ నాయకుల దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని కార్మికులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు మస్తానయ్య, వీడీఆర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా హెచ్‌ఎంల అసోసియేషన్ ఎన్నికలు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఎన్నికలు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో డివిజన్ అధ్యక్షుడిగా సోమవరపు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓ వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, సంగం, ఏఎస్‌పేట, ఉదయగిరి, సీతారామపురం, కలువాయి, చేజర్ల మండలాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం